చిత్తూరుకు నెత్తుటి మరక తొలగేనా?



ఒకప్పుడు గొప్ప కళా సాహిత్య సాంస్కృతిక పట్టణంగా విలసిల్లిన చిత్తూరులో ఆ తర్వాత ఐదు దశాబ్దాలపాటు నెత్తుటి చరిత్ర లిఖితమైంది. చింటూ సహా ఐదుగురికి ఉరిశిక్ష తీర్పును ప్రకటించడంతో నగరం ఉలికిపడింది. హత్యలు, ప్రతీకారాలు, దాడులు, ప్రతిదాడులు, బాంబులు, కాల్పులు, నరికి చంపడాలు, పోలీసు ఎన్‌కౌంటర్లు వంటి గత సంఘటనలను తలచుకుని చింతిస్తోంది. ఈ కఠిన శిక్షతో అయినా చిత్తూరు అణగి ఉంటుందని ఆశపడుతోంది. శాంతి వర్ధిల్లాలని ఆకాంక్షిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

చిత్తూరు రక్త చరిత్రలో కీలక ఘటనలు

- 1978లో పేరుమోసిన నేరగాడు సంతపేట ముత్తు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు.
- 1982లో సంతపేటకు చెందిన రౌడీ షీటర్ ఎలికుంజాకు విషం పెట్టి హత్య చేశారు.
- 1982లోనే ఓవర్ బ్రిడ్జిపై కొంగారెడ్డి పల్లెకు చెందిన కె.ఎం.కుమార్‌పై హత్యాయత్నం జరిగింది.
- 1984లో కొండమిట్టలో పేరు మోసిన రౌడీ రామచంద్ర హత్యకు గురయ్యారు.
- 1991లో శంకరయ్యగుంట అంబేద్కర్ నగర్‌లో ఓ యువతిపై రౌడీలు సామూహిక అత్యాచారం చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది.
- 1991లో ఇరువారంలో పద్మనాభరెడ్డి హత్యకు గురయ్యారు. అదే ఏడాది ప్రతీకార దాడిలో ప్రత్యర్థి కూడా హతమయ్యారు.
- 1992లో కొండమిట్ట రామచంద్ర సోదరుడు తనికాచలం సుబేదార్ వీధిలో హత్యకు గురయ్యాడు.
- 1992లోనే రామచంద్ర కుమారుడు కొండమిట్ట శివను పోలీసులు కాల్చి చంపారు.
- 1993లో విద్యార్థి నేతగా నగరంలో రౌడీయిజం చెలాయించిన దుర్గాప్రసాద్ హత్యకు గురికాగా అదే ఏడాది జరిగిన ప్రతీకార దాడిలో ప్రసాద్‌రెడ్డి హత్య చేయబడ్డాడు.
- 1994లో కొండమిట్ట రాజా డీఈవో కార్యాలయం ఎదుట దారుణ హత్యకు గురయ్యారు.
- 1999లో డీసీసీ అధ్యక్షుడిగా వుండిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై డీసీసీ కార్యాలయంలోనే దాడి జరిగింది. అనుచరులు అడ్డుకోగా కార్యాలయాన్ని, వాహనాలను ధ్వంసం చేశారు.
- 2000లో ఐఎన్‌టీయూసీ నేత ఈశ్వరరెడ్డి కట్టమంచి బ్రిడ్జి వద్ద దారుణ హత్యకు గురయ్యారు.
- 2002లో ఇంజనీరింగ్ విద్యార్థి రవిశంకర్ చౌదరి హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.
- 2005లో టీడీపీ నేత కఠారి మోహన్‌పై హత్యాయత్నం జరిగింది.
- 2006లో గుడిపాల టీడీపీ నేత మద్రాసు బాబును ప్రత్యర్థులు హత్య చేశారు.
- 2007 ఫిబ్రవరి 9న సీకే బాబుపై కిరాయి హంతకులు కాల్పులు జరిపారు. సీకే అనుచరులు ఇద్దరు, కిరాయి హంతకుడు ఒకరు మొత్తం ముగ్గురు మరణించారు.
- 2007 డిసెంబర్ 30న సీకే బాబును హతమార్చడానికి లాండ్‌మైన్ పేల్చారు. సీకేబాబు గన్ మ్యాన్ చనిపోయారు. మరొకరికి కాలు పోయింది.
- 2008లో మురకంబట్టు టీడీపీ నేత, న్యాయవాది సంపత్ రైల్వే బ్రిడ్జి వద్ద హత్యకు గురయ్యారు.
- 2015 నవంబర్ 17న మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోనే మేయర్ కఠారి అనురాధను, ఆమె భర్త కఠారి మోహన్‌ను తుపాకులతో కాల్చి, కత్తులతో నరికి చంపారు.

కొండమిట్ట రౌడీలు

తమిళనాడు సరిహద్దుల్లో వున్న చిత్తూరులో వ్యక్తి ఆరాధన బలంగా వేళ్ళూనుకుంది. రౌడీలను, గూండాలను హీరోలుగా చూసే పరిస్థితి కొనసాగింది. ఐదున్నర దశాబ్దాల కిందట చిత్తూరు కొండమిట్టకు చెందిన కొందరు రౌడీలు ఊరిని గడగడలాడించారు. దౌర్జన్యాలతో జనాన్ని హడలెత్తించారు. చీకటి పడ్డాక ఇళ్ళ నుంచీ బయటికి రావడానికి జంకే పరిస్థితి సృష్టించారు. కొండమిట్ట ప్రాంతంలోని రెండు సినిమా థియేటర్లకు రాత్రిళ్ళు మహిళలు వెళ్లేవారు కాదు. 1990వ దశకం దాకా ఈ పరిస్థితి నడిచింది. కొండమిట్టకు చెందిన రామచంద్ర, అతని సోదరుడు తనికాచలం, కుమారుడు శివ, కొండమిట్ట గుణ, కొండమిట్ట రాజా వంటివారు అప్పట్లో పేరుమోసిన రౌడీలుగా చెలామణి అయ్యారు. అగ్గిపెట్టి ఇవ్వలేదని తోటపాళ్యంలో, జామకాయ ఇవ్వలేదని పాత బస్టాండులో అన్నెంపున్నెం తెలియని ఇద్దరు అమాయకుల్ని రౌడీమూకలు హతమార్చిన ఘటనలు ఆనాటి చిత్తూరు రౌడీ సంస్కృతికి అద్దం పడతాయి.

రౌడీ రాజకీయం మొదలు

చిత్తూరులో పేరుమోసిన రౌడీ కొండమిట్ట రామచంద్ర హత్యతో ఒక్కసారిగా సీకేబాబు పేరు మారుమోగింది. విద్యార్థి నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన తర్వాత దాడులు, దొమ్మీలు, దౌర్జన్యాలు వంటి కేసుల్లో నిందితుడిగా మారారు. చాలా కేసులు నమోదయ్యాయి. అతడికి ముందు ఎంతోమంది రౌడీలుండినా రాజకీయాలకు వారికి సంబంధం ఉండేది కాదు. సీకేబాబు ఇండిపెండెంట్‌గా పోటీచేసి మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచారు. వ్యక్తిగత పలుకుబడితోనే ఆయన మున్సిపల్ వైస్ ఛైర్మన్ అయ్యారు. 1989 ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీ అండ దొరకడంతో చిత్తూరులో బలమైన నేతగా ఎదిగారు. ఈ కాలంలోనే చిత్తూరులో ఎంతో మంది హత్యలకు గురికాగా అనేక హత్యాయత్నాలు, దాడులు జరిగాయి. రౌడీలుగా ముద్ర పడిన కొండమిట్ట రామచంద్ర సోదరుడు తనికాచలం, కొడుకు శివ, కొండమిట్ట రాజా, గుణ, తదితరులంతా ఒకరొకరుగా హతమారిపోయారు. మిగిలినవారు రౌడీయిజాన్ని వదిలేశారు. సీకే బాబు చిత్తూరులో ఎదురులేని నాయకుడిగా మారిపోయారు. 1989 నుంచీ వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2002లో రవిశంకర్ అనే విద్యార్థి హత్యకేసులో సీకేబాబు అరెస్టు అయ్యారు. అయితే ఈ సంచలన కేసు నుంచి నిర్దోషిగానే బయటపడ్డారు.

కఠారి మోహన్‌పై హత్యాప్రయత్నం

చిత్తూరులో సీకేబాబు అనుచరుడిగా వున్న కఠారి మోహన్ కాలక్రమంలో ఆయనతో విభేదించారు. టీడీపీ టికెట్‌పై కౌన్సిలర్‌గా పోటీ చేశారు. ఆయనపై 2005లో హత్యాయత్నం జరిగింది. ఈ దాడి నుంచీ బతికి బయటపడ్డ ఆయన అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఈ కేసులో సీకే బాబు నిందితుడు.ఈ దాడి ఘటన చిత్తూరు హత్యా రాజకీయాలను మరింత ఎగదోసింది.ప్రతీకారంగా 2007 ఫిబ్రవరి 9న సీకే బాబుపై హత్యాయత్నం జరిగింది. బీహార్, కర్ణాటక రాష్ట్రాల నుంచీ వచ్చిన కిరాయి హంతకులు సీకేబాబుపై కాల్పులు జరపగా ఆయన తప్పించుకున్నా, అనుచరులు ఇద్దరు చనిపోయారు. సీకే బాబు గన్‌మెన్ కాల్పుల్లో కిరాయి హంతకుడు ఒకరు చనిపోయారు. అదే ఏడాది డిసెంబర్ 30న సీకే బాబుపై మరోమారు హత్యాప్రయత్నం జరిగింది. ఈసారి కట్టమంచిలో ఆయన ఇంటి సమీపంలో కల్వర్టు కింద లాండ్‌మైన్ పెట్టి సీకే ప్రయాణిస్తున్న వాహనాన్ని పేల్చేశారు. ఆ ఘటనలో కూడా సీకే తప్పించుకోగా ఆయన గన్‌మెన్ ఒకరు చనిపోయారు. మరొకరికి కాలు పోయింది. ఈ కేసుల్లో కఠారి మోహన్, చింటూ నిందితులు. వీరిద్దరూ బలపడుతూ సీకేబాబుకు బలమైన ప్రత్యర్థులుగా మారి సవాల్ విసిరే పరిస్థితి చిత్తూరులో నెలకొంది.

మేనమామకు అండగా వచ్చి హత్యకు తెగించిన చింటూ

చింటూ అలియాస్ శ్రీరామ చంద్రశేఖర్ కఠారి మోహన్‌కు స్వయానా సోదరి కుమారుడు. 2005లో మేనమామ కఠారి మోహన్‌పై హత్యాయత్నం జరగడం, అందులో ఆయన తీవ్రంగా గాయపడడం మెరైన్ ఇంజనీరింగ్ చేసి ముంబైలో ఉద్యోగం చేసుకుంటున్న చింటూను కలవరపరిచింది. ఉద్యోగం వదిలిపెట్టి కఠారి మోహన్ చెంతకు చేరాడు. అజ్ఞాతంలోనే వుంటూ సీకే బాబును హతమార్చేందుకు రెండు సార్లు సినీ ఫక్కీలో ప్రయత్నించారని అప్పట్లో చెప్పేవారు. ఆ కేసుల్లో నిందితుడిగా వుండి నానా అగచాట్లు పడిన తనకు, 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చి, కఠారి మోహన్ భార్య అనురాధ మేయర్ అయిన తర్వాత కూడా సరైన ప్రాధాన్యం లభించలేదని ఆయన భావించేవాడు. ఈ సమయంలోనే కఠారి మోహన్ కుటుంబంతో ఆయనకు దూరం పెరిగింది. చివరికి మేనమామను, ఆయన భార్యను హతమార్చిన కేసులో నేరం రుజువై ఉరిశిక్షను ఎదుర్కొంటున్నాడు.

ఇకనైనా ముగింపు పడేనా?

దశాబ్దకాలంగా చిత్తూరులో మునుపటి తీవ్ర సంఘటనలు లేవు. మాజీ ఎమ్మెల్యే సీకేబాబు 2014 నుంచీ రాజకీయంగా బలహీనపడుతూ వస్తున్నారు. మరోవైపు కఠారి మోహన్ దంపతులు హత్యకు గురి కావడం, వారి హత్య కేసులో చింటూకు ఉరిశిక్ష పడడం వంటి పరిణామాలతో చిత్తూరులో ఆధిపత్య రాజకీయాలకు తెర పడిందన్న భావన వ్యక్తమవుతోంది. అయితే రౌడీయిజం, దౌర్జన్యకర ప్రవృత్తి కలిగిన వ్యక్తులు ఇప్పటికీ ఎంతోమంది చిత్తూరులో వున్నారు. వారిలో ఎక్కువమంది ఒక ప్రతిపక్ష నేత చెంత వున్నారు. అవకాశం లభిస్తే వీరు పడగవిప్పే ప్రమాదం పొంచి ఉందనే భయం చిత్తూరు ప్రజల్లో ఉంది. కూటమి ప్రభుత్వం గట్టిగా వ్యవహరించకపోతే మాత్రం చిత్తూరు శాంతి భగ్నం అయ్యే ప్రమాదం ఉంది.

మూడోసారీ కొట్టుకుపోయిన వంతెన



నగరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరి నుంచి కీళపట్టుకు వెళ్లే మార్గంలో కుశస్థలీ నదిపై ఉన్న లోతట్టు వంతెన ముచ్చటగా మూడోసారి శనివారం కొట్టుకుపోయింది. కృష్ణాపురం రిజర్వాయర్‌లో నీరు అధికం కావడంతో నీటిని కిందకు విడుదల చేశారు. దీంతో నదిలో వరద ఉధృతి ఎక్కువై నదిపై ఉన్న లోతట్టు వంతెన కొట్టుకుపోయింది. వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఇకనైనా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్టేట్ టీం తనిఖీలు

చిత్తూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులు పరిస్థితులు, అందుతున్న సేవలు, ఉండాల్సిన వసతులు, పాటించాల్సిన పద్ధతులపై కామన్ రివ్యూ మిషన్ సెంట్రల్ టీం ఈనెల నాల్గవ తేదీ నుంచి జిల్లాలో పర్యటించనుంది. దాంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితోపాటు స్టేట్ టీం కూడా అప్రమత్తం అయ్యారు. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులను పరిశీలిస్తున్నారు. అక్కడున్న వైద్యులు, సిబ్బందికి పలు సూచనలిస్తున్నారు. ప్రధానంగా ఆస్పత్రిని శుభ్రంగా ఉంచుకోవాలని చెబుతున్నారు. మొత్తానికి సెంట్రల్ టీం రాకతో ప్రభుత్వ ఆస్పత్రులు బాగుపడనున్నాయి. మందులు, మాత్రలు, వ్యాక్సిన్లు, రికార్డులు అప్డేట్ అవుతున్నాయి. శనివారం నగరంలోని టెలిఫోన్ కాలనీలోని యూపీహెచ్‌సీని, కాణిపాకం పీహెచ్‌సీ, తుశ్లూరు, వసంతాపురం, జంగాలపల్లె హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను స్టేట్ టీం సభ్యులు సుబ్రహ్మణ్యం, నితీష్‌రామ్ పరిశీలించారు. అలాగే కుప్పం పరిసర ఆస్పత్రులను డీఎంహెచ్‌వో సుధారాణి తనిఖీ చేసి.. సూచనలు ఇవ్వగా.. డీఐవో హనుమంతరావు పలమనేరు పరిసర పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. నగరి ఏరియా వైద్యశాలను ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్ తేజ్ పరిశీలించారు.



చిత్తూరు టెలిఫోన్ కాలనీలోని యూపీహెచ్‌సీ ఫార్మసీలో తనిఖీలు

డ్వాక్రా గ్రూపు సభ్యుల రూ.కోటి నిధులు హాంఫట్

● బ్యాంకు మేనేజర్ సహా ఆర్పీ, మెప్మా సిబ్బందిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం),నవంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో డ్వాక్రా సంఘాలకు చెందిన నిధుల స్వాహా పర్వం ఆగడం లేదు. తాజాగా మరో రూ.కోటి నిధులు గోల్‌మాల్ కావడంపై కేసు నమోదయ్యింది. బాధితుల్లో ఒకరైన మాధవి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. దీపిక ఎస్ఎల్ఎఫ్ పేరుతో ఉన్న 26 సంఘాలకు నౌహీరా రీసోర్సు పర్సన్‌గా పనిచేస్తోంది. ఈ సంఘాలకు సంబంధించి 260 మంది సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను రెండేళ్లుగా నౌహీరా ద్వారా చెల్లిస్తున్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని ఇండియన్ బ్యాంకు మాజీ మేనేజర్ ధనంజయ, మెప్మా సిబ్బంది అమ్మాజీ, ప్రమీల, రెడ్డెమ్మ, వసంత, పాతిమాతో నౌహీరా కుమ్మక్కై బ్యాంకులో నకిలీ డిపాజిట్ కౌంటర్ ఫైల్ తీసుకుని డబ్బులు బ్యాంకులో చెల్లించకుండానే చెల్లించినట్లు నకిలీ రసీదులు సృష్టించింది. వాటిని డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఇస్తూ వచ్చింది. రుణాలు చెల్లించాలంటూ బ్యాంకు సిబ్బంది నుంచి డ్వాక్రా సభ్యులకు ఒత్తిడి రావడంతో ఆమెను నిలదీశారు. నౌహీరా నీళ్లు నమలడంతో బ్యాంకుకు వెళ్లి విచారించారు. రెండేళ్ల నుంచి బ్యాంకులో పైసా కూడా చెల్లించలేదని తేలింది.బ్యాంకు మాజీ మేనేజర్‌తో పాటు నౌహీరా, మెప్మా సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

95.20 శాతం సామాజిక పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ తొలి రోజైన శనివారం జిల్లావ్యాప్తంగా 95.20 శాతం జరిగింది. 2,67,786 మందికిగాను 2,54,943 మందికి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పింఛను సొమ్ము అందజేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో, మిగిలిన 12,843 మందికి సోమవారం అందజేయనున్నారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పంపిణీ జరిగింది.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ ముడగల్, తెలంగాణ రాష్ట్ర మంత్రి వి.శ్రీహరి దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



మంత్రి శ్రీహరి - జస్టిస్ ముడగల్

కిటకిటలాడిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):ముక్కంటి ఆలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 26వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.




సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.76 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,539

తలనీలాలు సమర్పించినవారు: 23,144



రైతులకు వరం కారాకొల్లు కషాయం




- నేల సురక్షితం.. దిగుబడి అధికం.. కలుపు మాయం
- గ్రామీణశాస్త్రవేత్తల పరిశోధనా ఫలితం

SUNDAY SPECIAL

తొట్టంబేడు మండలం కారాకొల్లు గ్రామానికి చెందిన రైతు గల్లా చంద్రశేఖర్ నాయుడు, ఆయన మిత్ర బృందం నాలుగు దశాబ్దాలుగా పలు పరిశోధనలు చేస్తున్నారు. నేలతల్లిని కాపాడుకునే దిశగా వీరు చేస్తున్న పరిశోధనలు మంచి ఫలితాలను ఇచ్చాయి. మూలికా విధానం ద్వారా నెమటోడ్స్ (వేరు పురుగు)ను నివారించే మందును 2012లో కనిపెట్టారు. దీనికి నెమ్‌జాప్ అని పేరు పెట్టారు. 2020లో అహ్మదాబాద్ సృష్టి ల్యాబ్స్ నుంచి దీనికి పేటెంట్ కూడా పొందారు. ఇక కలుపు నివారణ కోసం వీడ్ జాబ్, పంట ఎదుగుదల కోసం గ్రోత్ ఫిట్ కషాయాలను రూపొందించారు. ఈ రెండింటితో పాటు మరికొన్ని ఉత్పత్తులు కలుపుకుని మొత్తం పదింటికి పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

- కథనం : శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

25 వేల ఎకరాలకు కారాకొల్లు మందులు

కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తల మిత్ర బృందం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలో ప్రస్తుతం ఈ మందులను భారీ ఎత్తున తయారు చేస్తున్నారు. యూరియా పొటాషియంలకు ప్రత్యామ్నయం కావడంతో గ్రోత్ ఫిట్ మందు పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. కలుపు నివారిణి వీడ్‌జాబ్ మంచి ఫలితాలను ఇస్తోంది. దీంతో తెలంగాణలో సుమారు 5వేల మంది రైతులు పదివేల ఎకరాల్లో ఈ రెండు ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. మన రాష్ట్రంలో 6 వేల మంది రైతులు 12 వేల ఎకరాల్లో కారాకొల్లు కషాయాలను వాడుతున్నారు. సరిహద్దుల్లోని తమిళనాడు, కర్ణాటక నుంచి వీరి మందుల కోసం అడుగుతుంటారు. ఏడాదికి 40 వేల లీటర్ల మందులను వీరు ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తున్నారు.

శ్రీకాళహస్తిలోని కషాయాల తయారీ బాధ్యతలన్నీ కారాకొల్లు రైతులే చూస్తున్నారు. గ్రామ్‌బజార్ అనే యూట్యూబ్ చానెల్ వీరి మందుల గురించిన సమాచారం వీడియోల రూపంలో పెడుతూ ఉంటుంది. ఈ మందులు వాడుతున్న రైతుల అనుభవాలను, పంటల తీరును చూపిస్తుంటారు.

కారాకొల్లు కషాయాలు కావాలంటే:
www.gramabazaar.com
వరిలో కొనుగోలు చేస్తే ఆర్టీసీ పార్శిల్ ద్వారా పంపుతారు.
వివరాలకు:
9849541674

కారాకొల్లు మందులు





వీడ్‌జాబ్: వరిలో కలుపు నివారణకు అద్భుత ఫలితాలనిస్తోంది. ఎకరాకు మూడు లీటర్ల మందు అవసరం. ఇది లీటరు రూ.600

వాడే విధానం: వరి నాట్లకు ముందు నీళ్ల పెట్టి దమ్ము చేసుకునే సమయంలో ఈ మందును ఇసుకలో కలిపి చల్లాలి. వరి నాటుకున్న తర్వాత అందులోని నీళ్ల 15 రోజుల పాటు బయటకు పోనివ్వకుండా చూసుకోవాలి.

ప్రయోజనం: వరిలో సాధారణంగా వచ్చే ఏ రకమైన కలుపూ ఎదగదు. పైగా మొలిచిన కలుపును ఇది చంపేసి ఎరువుగా మార్చేస్తుంది.

గ్రోత్‌ఫిట్: ఇది మంచి పోషకం. వరి సహా అన్ని పంటలకూ వాడవచ్చు. వరి అయితే ఎకరాకు మూడు లీటర్లు అవసరం. లీటరు రూ.600.

వాడే విధానం: వరి నాటిన 25రోజులకు రెండు లీటర్ల మందు ఇసుకలో కలిపి చల్లాలి. ఆ సమయంలో పొలంతో నీళ్ల ఉండాలి. వరి వెన్ను వచ్చే ముందు అంటే 35 రోజులకు ఒక లీటరు మందులో 100లీటర్ల నీళ్ల కలిపి స్ప్రే చేయాలి. వరి 5నెలల పంట అయితే ఇంకోసారి 2లీటర్ల మందు వేయాలి.

ప్రయోజనం: పొలం పచ్చగా నిగనిగలాడుతూ ఎదుగుతుంది. వెన్ను బలంగా వస్తుంది. గింజ రాలదు. దిగుబడి పెరుగుతుంది.

నెమ్‌జాప్: వేరుపురుగును నివారించే ఈ మందు వరి, మామిడి తప్ప అన్ని రకాల పంటలకీ వాడుకోవచ్చు. కూరగాయల తోటల్లో ఇది మంచి ఫలితాలను ఇస్తోంది. ఎకరాకు రెండు లీటర్ల మందు అవసరం. లీటరు ధర రూ.800. దీనికి పేటెంట్ కూడా లభించింది.

వాడే విధానం: పంట వేసే ముందు ఇసుకలో కలిపి చల్లుకోవాలి. పంట వేశాక అయితే ఒక లీటరు మందును వందలీటర్ల నీళ్లలో కలిపి డ్రిప్‌లో వదలాలి.

ఈ మందు వాడిన 15రోజుల తర్వాత గ్రోత్ ఫిట్ స్ప్రే చేస్తే పూతవిరగ్గాస్తుంది. కాయ సైజు పెరుగుతుంది. నాణ్యత ఉంటుంది.

నొప్పి నివారిణి శ్రీశైలం

కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తలు తయారు చేసిన శ్రీశైలం పెయిన్ రిలీవర్‌గా ఉపయోగపడుతుంది. ఇది కూడా పూర్తిగా ఆకు పసరు నుంచి తయారు చేసిందే. నొప్పి ఉన్న చోట పూసుకుంటే చాలు. అలాగే పడుకునే ముందు ఒంటికి పూసుకుంటే దోమలు దగ్గరకు కూడా రావు. గాయాలకు పూస్తే వేగంగా నయమవుతాయి. సొరియాసిస్ తప్ప అన్ని రకాల చర్మ వాధులకు ఇది మంచి ఫలితాలు ఇస్తోందని గ్రామీణ శాస్త్రవేత్త చంద్రశేఖర్ చెబుతున్నారు.

ఎరువులకన్నా ఖర్చు తక్కువ

యూరియా, పొటాషియం, డీఏపీ వంటి రసాయన ఎరువులను సాధారణంగా రైతులు వినియోగిస్తారు. కలుపు నివారణకు మందులు చల్లుతారు. వీటికి ఎకరా వరికి రూ.6వేలు ఖర్చవుతుంది. చీడపీడల పురుగు మందుల కోసం రూ.8,400 వ్యయం చేయాలి. అంటే ఎకరా వరికి రూ.14,500లు ఖర్చు అవుతుంది. అదే కారాకొల్లు కషాయాలు వాడితే కేవలం రూ.3600తో ఎకరా వరి సాగవుతుంది.



వయ్యారిభామపై యమపాశం

వయ్యారిభామ, కాంగ్రెస్ గడ్డి, పార్థీనియం వంటి పేర్లతో పిలిచే పిచ్చి మొక్క తీవ్ర అనారోగ్యాలకు కారకమని గుర్తించి దీన్ని అణుబాంబుతో పోలుస్తారు. కారాకొల్లు శాస్త్రవేత్తలు తయారుచేసిన కలుపుమందును చల్లగానే అర గంట వ్యవధిలో వయ్యారిభామ నిలువునా మాడిపోతుంది. ఇది తర్వాత అదే నేలకు ఎరువుగా మారిపోతుంది. ఈ మందు కూడా మన చుట్టూ లభించే పిచ్చిమొక్కల నుంచే తయారు చేయడం విశేషం. రైతులకు మరింత లాభదాయకంగా ఉండేలా ఈ మందుపై పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

40 ఏళ్ల క్రితం నేను, భాస్కర్, బత్తినాయుడు, మురళి, వెంకటేశ్వర్లు, శివయ్య, చిరంజీవులు, శ్రీధర్ అనే ఏడుగురు మిత్రులు కలిసి ప్రారంభించిన పరిశోధనల ఫలితమే ఇవి. రసాయన ఎరువులు, పురుగుమందులు భూమి కడుపులో విషంగా మారి మన ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నాయని అందరికీ తెలుసు. ప్రత్యామ్నాయంగా సేంద్రియ సేద్యాన్ని సూచిస్తున్నారు. గడ్డి, ఆకులు వంటివి మేతగా స్వీకరించే పశువుల విసర్జితమే ఈ సేద్యంలో కీలకం. నేలలో మిత్రకీటకాల వృద్ధికి దోహదం చేస్తున్నది ఇదే. పశువులు స్వీకరించి విసర్జించిన తర్వాత ఏర్పడే సేంద్రియ గుణాలను కలిగివున్న మొక్కలపై దశలవారీగా మేం చేసిన పరిశోధనల్లోంచే గ్రోత్‌ఫిట్, నెమ్‌జాప్, వీడ్‌జాబ్ వంటివి తయారయ్యాయి. ఇంకా చవగ్గా రైతులకు అందించేలా ఇప్పటికీ మా పరిశోధనలు కొనసాగుతున్నాయి.

- చంద్రశేఖర్



పైరు బాగా పెరిగింది

మాది తొట్టంబేడు మండలం కొమ్మలగుంట గ్రామం. నాకున్న ఎకరా నేలలో తెలంగాణ నుంచి గౌతమ బుద్ద అనే దేశవాళీ నాటు వరి విత్తనాలను కొనుగోలు చేశాను. ధాన్యం చూడ్డానికి నల్లగానూ.. అన్నం మామూలుగా తెల్లగాను ఉంటుంది. ఇది అరుదైన రకం కావడంతో కిలో బియ్యం రెండు వందల యాభై రూపాయలు చొప్పున మార్కెట్ ధర ఉంది. కారాకొల్లు కషాయాలు చల్లాను. వీడ్‌జాబ్‌తో అసలు కలుపు సమస్య రాకుండా... ఎరువుగా కూడా ఉపయోగపడి పైరు బాగా వచ్చింది. మధ్యలో గ్రోత్ ఫిట్ వినియోగించాను. పైరు బాగా ఎత్తుగా పెరిగింది.

- రాంబాబు





పోటీలను ప్రారంభిస్తున్న రవినాయుడు

రాష్ట్రస్థాయి లాన్‌టెన్నిస్ పోటీలు ప్రారంభం

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్రమ్ టెన్నిస్ అకాడమీలో శనివారం 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ లాన్ టెన్నిస్ అండర్-14, అండర్ 17, అండర్-19 పోటీలను శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి జిల్లాకు 30మంది చొప్పున 390మంది క్రీడాకరులు ఈ పోటీలకు విచ్చేశారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెలలో డిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా స్కూల్ గేమ్స్ పోటీలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్,ఏర్పేడు మండలాధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు,నాయకులు కాసరం రమేష్,రవీంద్రనాథ్‌రెడ్డి, కూటమి నాయకులు,తిరుపతి స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కిషోర్ పాల్గొన్నారు.

హాథీరాంజీ మఠం కూల్చివేస్తారన్నది అపోహ మాత్రమే

- దెబ్బతిన్న ప్రాంతాన్నే పునర్నిర్మిస్తాం ● కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి గాంధీ రోడ్డులోని హాథీరాంజీ మఠాన్ని మొత్తంగా కూల్చివేస్తారన్నది అపోహ మాత్రమేనని, దెబ్బతిన్న ప్రదేశాలను పునర్నిర్మిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లో శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలిసి ప్రజాప్రతినిధులు, మఠం కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. పురాతనమైన హాథీరాంజీ మఠం విషయంలో ఎక్స్పర్ట్ కమిటీని నియమించి వారి సలహాలు తీసుకున్నామని తెలిపారు. గాంధీ రోడ్డు వైపు ఉన్న భాగం దెబ్బతిందని, ఉత్తరం వైపు ఉన్న మొదటి అంతస్తు భాగం పూర్తిగా ధ్వంసమైందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రసన్నకుమార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ డైరెక్టర్ ఆర్ఎస్ఎస్ మూర్తి తెలిపారన్నారు. ఈ మఠాన్ని మద్రాస్ టెర్రస్ రూఫింగ్ టెక్నాలజీని ఉపయోగించి పూర్వం నిర్మించారని, అదే తరహాలో పునర్నిర్మాణం చేస్తామని అన్నారు. త్వరగా పూర్తి చేసి, బంజారా భక్తులకు వసతిగృహం, వ్యాపారులకు దుకాణాలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ పాల్గొన్నారు.

కళలపైనా ఆసక్తి పెంచుకోండి

- బాలోత్సవ ప్రారంభోత్సవంలో కలెక్టర్ పిలుపు



తిరుపతి (కల్చరల్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు కళలూ సాహిత్యం పట్ల కూడా ఆసక్తిని పెంపొందించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు.తిరుపతి నాల్గవ బాలోత్సవాన్ని నగరంలోని ఎస్వీఎస్ ఆర్ట్స్ కాలేజీలో శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో సృజనాత్మక శక్తి మెరుగుపడుతుందన్నారు.ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని,అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం అందిస్తుందని హామీ ఇచ్చారు.డీఈవో కుమార్,సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.బాలోత్సవం స్థాపకులు మల్లారపు నాగార్జున మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగున్న సామర్థ్యాన్ని వెలికితీయాలనే సంకల్పంతో విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక అంశాలపై పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.పిల్లల్లో సామాజిక స్పృహ , దేశభక్తి, సమష్టితత్వం పెంపొందించాలనే ఆశయంతో ఏటా ఈ కార్యక్రమాన్ని నాలుగేళ్లుగా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.బాలోత్సవం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం, కస్తూరిబా గాంధీ ట్రస్టు ఛైర్మన్ పి.సి. రాయలు, రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజేంద్ర శెట్టి, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ రమేష్ నాథ్ లింగుట్ల, క్రియా పిల్లల పండుగ సెక్రటరీ కాకినాడ జగన్నాథ రావు, ఎస్వీఎస్ కాలేజ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.




చిన్నారుల సందడి

- హుషారుగా సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనలు
- నేడు విజేతలకు బహుమతుల ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):బాలోత్సవంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రతిభా పోటీల్లో అదరహో అనిపించారు.వేలాది మంది చిన్నారులు తమలోని సుకుమార భావాలను వ్యక్తం చేసి ఆహూతులను మైమరిపించారు.ఆరు సమాంతర వేదికలపై ఇరవై ఒక్క అంశాలపై పోటీలు నిర్వహించారు.ఫ్యాన్సీ డ్రెస్, బొమ్మకు కథ రాయండి, కథ చెబుతాను ఊ కొడతారా, కథ రాయడం, స్పెల్-బీ (ఇంగ్లీషు), గజిబిజి సరిచేద్దాం, మ్యాప్, మెమరీ టెస్ట్, తెలుగు దినపత్రిక పఠనం, లేఖారచన, బెస్ట్ ఫ్రం వేస్ట్, జానపద నృత్యం, ఇన్‌స్ట్రుమెంట్, బుర్రకథ, ఏకపాత్రాభినయం, క్లాసికల్ డ్యాన్స్, దేశభక్తి గీతాలాపన, లఘునాటిక, చదరంగం వంటి అంశాలపై ఆసక్తికరంగా పోటీలు సాగాయి.ఆదివారం చిత్రలేఖనం, పదకేళి (పదవినోదం), గణిత తర్కం, తెలుగులో మాట్లాడటం, తెలుగులో ఉపన్యాసం, పద్యం-భావం, క్విజ్, మట్టితో బొమ్మల తయారీ, సంప్రదాయ నృత్యం, దేశభక్తి గేయాలాపన, జానపద నృత్యం, కోలాట ప్రదర్శనం, యోగ, శాస్త్రీయ సంగీతం, జానపద గీతాలు, చెస్ తదితర పోటీలు నిర్వహించనున్నారు.సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ముగింపు సభకు ఎస్పీ సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.సాంస్కృతిక ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు బాలోత్సవం స్థాపకులు మల్లారపు నాగార్జున, అధ్యక్షులు నడ్డి నారాయణ తెలిపారు.

నేడు నారావారిపల్లెకు రోహిత్ దంపతుల రాక

చంద్రగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు కుమారుడు, సినీహీరో నారా రోహిత్ దంపతులు ఆదివారం స్వగ్రామమైన నారావారిపల్లెకు రానున్నారు. ఇటీవల హైదరాబాదులో రోహిత్ వివాహమైన సంగతి తెలిసిందే. నవ దంపతులు ఉదయం నారావారిపల్లెకు చేరుకుని, రామ్మూర్తి నాయుడి ఘాట్ వద్ద నివాళులర్పించనున్నారు. గ్రామదేవత దొడ్డి గంగమ్మకు, ఇంటి దేవత నాగాలమ్మకు పూజలు నిర్వహించనున్నారు. అనంతరం హైదరాబాదుకు వెళ్లనున్నారు.

ఏవీఎస్వో కళావతి బదిలీ

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): టీటీడీ తిరుపతి విజిలెన్స్ వింగ్ ఏవీఎస్వో కళావతి బదిలీ అయ్యారు. గత కొన్నేళ్లుగా విజిలెన్స్ వింగ్ విభాగంలో ఆమె ఏవీఎస్వోగా ఉన్నారు. పలు కీలకమైన కేసుల్లో సమర్థవంతంగా విచారణ జరిపి ప్రసంశలు అందుకున్న ఆమె విమర్శలు కూడా భారీగా ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వం నుంచే ఏవీఎస్వోగా ఉన్న ఆమెను బదిలీ చేసి వైజాగ్ డీజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, ఈ పోస్టులో ఎవరిని నియమిస్తారనేది తెలియాల్సి ఉంది.

ఎస్వీయూ రెక్టార్‌గా అప్పారావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ రెక్టార్‌గా వర్సిటీ బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు నియమితులయ్యారు. వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు శనివారం నియామక ఉత్తర్వులు అందజేసి అభినందించారు. అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరిస్తారు. షుగర్ వ్యాధి నివారణలో మొక్కల పాత్ర అనే అంశంపై పరిశోధనలు చేపట్టిన అప్పారావు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు.15 నెలలు ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీగా సేవలందించారు. గతంలో సీడీసీ డీన్, డెవలప్‌మెంట్ డీన్, ఫార్మసీ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. నాలుగు పుస్తకాలు, 150 పరిశోధనా వ్యాసాలు రాశారు. 26 పీహెచ్‌డీలకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. 12 పరిశోధనా ప్రాజెక్టులు పూర్తి చేశారు. ఈ ఏడాది జూలైలో రిటైరు కానున్నారు. దీంతో ఎనిమిది నెలల పాటు రెక్టార్‌గా కొనసాగనున్నారు.



మంచుదుప్పటి

పెనుమూరు మండలంలో శనివారం ఉదయం 8 గంటలు దాటినా మంచు ప్రభావం తగ్గలేదు. మంచు కమ్మేయడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది.మరోవైపు వర్షాలు నిలిచాక మూడ్రోజులుగా పగలు ఎండ వేడి ఎక్కువగానే ఉంటోంది.

- పెనుమూరు, ఆంధ్రజ్యోతి



నింగీనీరు నీలవర్ణ శోభితం

బైరెడ్డిపల్లె మండలం కడపనత్తం చెరువులో ఇటీవల కురిసిన వర్షాలకు కొంతవరకు నీరుచేరింది. నింగీ,నీరు ఏకమైన విధంగా నీలవర్ణ శోభితమై శనివారం ఉదయం చెరువులో కనిపించిన దృశ్యం చూపరులకు కనువిందు చేసింది.

- బైరెడ్డిపల్లె, ఆంధ్రజ్యోతి



కార్తీక వెలుగులు

రామకుప్పంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.ఆలయం వద్ద, వెనుక వున్న త్రిమూర్తి, నక్షత్ర, నవగ్రహ, రాశీ వనాల్లో శనివారం రాత్రి భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక దీపాలతో ఆలయ పరిసరాలు వినూత్న సంతరించుకున్నాయి.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి

మహావీరుల త్యాగాలను స్మరించుకోవాలి

● జాతీయ గౌరవ దివస్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్



మహనీయుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహావీరుల త్యాగాలను స్మరించుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. జాతీయ గౌరవ దివస్‌ను కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో శనివారం నిర్వహించారు. బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు, గంటం దొర, మల్లు దొర, బోనంగి పాండు పడేల్, హనుమంతప్ప చిత్రపటాలకు కలెక్టర్ పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన ధీశాలి బిర్సా ముండా అన్నారు. చిన్న వయసు నుంచే బ్రిటీష్‌పాలకులు, భూస్వాముల దోపిడీపై పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. జిల్లాలో గిరిజనులు 60-70వేల వరకు ఉండొచ్చని తెలిపారు. గిరిజనులందరూ చదువుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన అధికారి మూర్తి, డీవీఎంసీ సభ్యులు రాజ్‌కుమార్, దేవరాజులు, శంకర్, ధనశేఖర్, శేషాద్రి, మునస్వామి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామకంఠం వివాదంలో ముగ్గురి అరెస్టు

నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు - 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి

నాగమవాండ్లపల్లెలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

ఐరాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఐరాల సమీపంలోని నాగమవాండ్లపల్లెలో నెలకొన్న గ్రామకంఠం వివాదంలో ముగ్గురిని అరెస్టు చేశారు. కల్లూరు సీఐ జయరామయ్య శనివారం మీడియాకు వివరాలు తెలిపారు. నాగమవాండ్లపల్లెలో అక్కిపల్లె శివప్రసాద్‌యాదవ్ తాను నిర్మిస్తున్న ఇంటిని ఆనుకుని ఉన్న సర్వేనెంబరు 537/544లోని 4.9 సెంట్ల గ్రామకంఠం భూమిలో ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం యత్నించాడు. దీన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ వచ్చి శివప్రసాద్ యాదవ్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో పృథ్వీరాజ్‌పై శివప్రసాద్ తన బంధువులైన సూరిమాని శివ, సూరిమాని సంతోష్‌లతో కలిసి మారణాయుధాలతో దాడి చేశాడు. పృథ్వీరాజ్‌కు గాయాలవగా చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో గొడవలు రాజుకున్నాయి. ఐరాల పోలీసుల సమాచారంతో కల్లూరు, పూతలపట్టు సీఐలు జయరామయ్య, కృష్ణమోహన్‌లు సంఘటన స్థలానికి సిబ్బందితో వచ్చి పికెట్ ఏర్పాటు చేశారు. దీనిపై పృథ్వీరాజ్ బంధువు చలపతి ఫిర్యాదుతో శివప్రసాద్ యాదవ్, శివ, సంతోష్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. నిందితులను చిత్తూరులోని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతుందని సీఐ జయరామయ్య తెలిపారు. ఈ కారణంగా ఉదయం తొమ్మిది గంటలు అవుతున్నా గ్రామం నిర్మానుష్యంగా మారింది.



నాగమవాండ్లపల్లెలో పోలీసు బలగాలు

స్కూల్, కాలేజి బస్సులపై ప్రత్యేక డ్రైవ్

● డీటీసీ నిరంజన్ రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న నిరంజన్ రెడ్డి

చిత్తూరు సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్, కాలేజి బస్సులపై త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు డీటీసీ నిరంజన్ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. డీటీసీ మాట్లాడుతూ.. విద్యాసంస్థల బస్సులను ఫిట్‌గా ఉంచుకోవడంతోపాటు అన్ని పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్సు కలిగిన డ్రైవర్లను నియమించుకోవాలన్నారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారం రోజుల సమయం ఇస్తున్నామని, అంతలోపు బస్సుల్లో ఎలాంటి రిపేర్లున్నా చేసుకోవాలని స్పష్టం చేశారు. ఆ తర్వాత స్పెషల్ డ్రైవ్ ఉంటుందని, నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు రాజేశ్వర్‌రావు, నరసింహులు, మురళి, ఏఎంవీఐలు హరికృష్ణ, దీపిక పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బస్సు : నలుగురికి గాయాలు



వెనుకభాగం నుజ్జయిన కారు

నగరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కారును బస్సు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. నగరి కేవీకే మైదానంలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పాల్గొనడానికి శనివారం కార్వేటినగరం నుంచి వస్తున్న క్రీడాకారులు, పీటీ మాస్టర్ ఓ కారులో బయల్దేరారు. నగరి మండలంలోని రామాపురం వద్ద ఇరుకు రోడ్డులో మలుపు వద్ద ఉన్నట్టుండి ఎదురుగా లారీ వచ్చింది. గమనించిన కారు డ్రైవర్ వాహనం ఆపడంతో వెనుకన వేగంగా వస్తున్న తమిళనాడు బస్సు కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు వెనుకభాగం నుజ్జయ్యింది. అదృష్టవశాత్తూ వాహనంలో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కారులోని నలుగురూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితులకు స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మా బిడ్డకు న్యాయం జరిగేవరకు పోరాటం

● కళాశాల వద్ద బంధువుల ధర్నా



బాధితులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్

చిత్తూరు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'కళాశాల ఫ్యాకల్టీ వేధింపుల కారణంగానే మా బిడ్డ నందినిరెడ్డి ఆత్మహత్యకు యత్నించి చావుబతుకుల మధ్య పోరాడుతోంది. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపం' అని విద్యార్థిని బంధువులు స్పష్టం చేశారు. పలు సంఘాలతో కలిసి నందినిరెడ్డి బీటెక్ చదువుతున్న కళాశాల వద్ద శనివారం ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా తమ బిడ్డ డ్రెస్‌కోడ్‌పై ఫ్యాకల్టీ అసభ్యంగా మాట్లాడారన్నారు. వారి తీరుపై తీవ్ర మనోవేదనకు గురై వాట్సాప్ స్టేటస్‌లో చనిపోతానని పోస్టు పెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కళాశాల భవనం నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించిందన్నారు. తీవ్రగాయాలవడంతో ఆస్పత్రి ఖర్చులు భరిస్తామని చెప్పిన కళాశాల యాజమాన్యం ఆ తర్వాత పట్టించుకోలేదని ఆరోపించారు. అప్పులు చేసి రూ.రెండు లక్షల వరకు సీఎంసీలో కట్టాకే ఆపరేషన్లు చేశారన్నారు. ఇప్పటికైనా తమ బిడ్డను మానసికంగా వేధించిన ఫ్యాకల్టీపై చర్యలు తీసుకోవడంతోపాటు ఆస్పత్రి ఖర్చులను భరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్ అక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయాలని కాలేజీ ప్రిన్సిపాల్‌కు చెప్పానన్నారు. ట్రైనీ కలెక్టర్ హామీతో బాధితులు ధర్నా విరమించారు.

గజదాడులతో మామిడి రైతుకు అపార నష్టం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడిచెట్లను చూపుతున్న రైతు దామోదర్‌నాయుడు

కల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు దాడులతో మామిడి రైతులకు అపారనష్టం వాటిల్లుతోంది. మండలంలోని పాళెం పంచాయతీలో గురువారం రాత్రి 16 ఏనుగుల గుంపు దాడిలో కోటపల్లిలోని దామోదర్‌నాయుడుకు చెందిన సుమారు 50 మామిడిచెట్లను ధ్వంసం చేసిన సంఘటన శనివారం ఆలస్యంగా తెలిసింది. అటవీ సరిహద్దు ప్రాంతంలోని దామోదర్‌నాయుడుకు మామిడితోట ఉండటంతో ఏనుగుల గుంపు ఇప్పటికే అనేక పర్యాయాలు మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి గురువారం రాత్రి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు కోటపల్లికి చెందిన దామోదర్‌నాయుడు మామిడితోటలోకి చేరుకున్నాయి. సుమారు 15 ఏళ్ల క్రితం నాటిన 50 మామిడిచెట్ల కొమ్మలను పూర్తిగా విరిచేశాయి. శనివారం ఉదయం మామిడితోట వద్దకు వెళ్లగా ఏనుగులతో ధ్వంసమైన మామిడిచెట్లను చూసి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 50 మామిడిచెట్లను ఏనుగులు ధ్వంసం చేయడం బాధాకరమని రైతు వాపోయాడు. ధ్వంసమైన మామిడిచెట్లకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని రైతు కోరారు.

రేపటి నుంచి గుజ్జు ఫ్యాక్టరీల ముందు ఆత్మీయ సమావేశాలు

మామిడి రైతుల సంక్షేమ సంఘం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కిలోకు రూ.8 చెల్లించాలని కోరుతూ సోమవారం నుంచి దశలవారీగా జిల్లాలోని అన్ని గుజ్జు ఫ్యాక్టరీల ముందు ఆత్మీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు మామిడి రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిబాబు, ఆనందనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గుడిపాల మండలంలోని తాసా ఫ్యాక్టరీ, బుధవారం జీడీ నెల్లూరులోని జైన్ ఫ్యాక్టరీ, శుక్రవారం బంగారుపాళ్యంలోని సన్‌గోల్డ్ ఫ్యాక్టరీల్లో సమావేశాలు నిర్వహించి.. కంపెనీలపై ఒత్తిడి తేనున్నట్లు పేర్కొన్నారు.

నేడు మాడవీధుల్లోకి ఉగ్రశ్రీనివాసమూర్తి

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కైశిక ద్వాదశి సందర్భంగా ఉగ్రశ్రీనివాసమూర్తి ఆదివారం ఆలయ మాడవీధుల్లో ఊరేగనున్నారు. ఈ సందర్భంగా సాలకట్ల కైశిక ద్వాదశి ఆస్థానాన్ని టీటీడీ నిర్వహించనుంది. ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ఏడాదిలో ఒక్కసారే ఈ రోజున సూర్యోదయానికి ముందు మాడవీధుల్లో ఊరేగిస్తారు.

కుప్పం ప్రభుత్వాస్పత్రిలో డీఎంహెచ్‌వో తనిఖీలు



వైద్యులకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుధారాణి తదితరులు

కుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వాస్పత్రిని శని వారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డీటీ సుధారాణి తనిఖీ చేశారు. సీఆర్ఎం (కామన్ రివ్యూ మిషన్)కు చెందిన కేంద్ర బృందం ఈనెల 3 నుంచి 9 వరకు జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్న నేపథ్యంలో డీఎంహెచ్‌వో తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రి పరిధిలోని డీఐఎన్‌సీ సెంటర్‌ను సందర్శించి అక్కడి వైద్య బృందానికి పలు సూచనలు చేశారు. రోజువారీ చికిత్సల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే కష్టతరమైన కేసులు ఏవైనా వస్తే పెద్దాస్పత్రులకు సిఫార్సు చేయడమే కాకుండా శస్త్రచికిత్స అయిన వెంటనే పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బంది సయమ పాలన పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర అధికారులు, స్థానిక ప్రభుత్వ, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురిపై గృహహింస కేసు

రామకుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బగళనత్తం గ్రామానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్త, మామలతోపాటు మరో ముగ్గురిపై పోలీసులు గృహహింస కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. బగళనత్తం గ్రామానికి చెందిన బాలిరెడ్డి కుమార్తె శిల్ప(29)కు కర్ణాటక రాష్ట్రం నంగిలి సమీపంలోని వెంకటాపురంకు చెందిన రామిరెడ్డి కుమారుడు గణేష్‌రెడ్డి(32)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి సందర్భంగా కట్న కానుకలు ఇచ్చారు. శిల్ప, గణేష్‌రెడ్డిలకు పెళ్లయిన ఏడాదిలో కుమార్తె జన్మించింది. అయితే గణేష్‌రెడ్డి శిల్పను ఏడు రోజుల కుమార్తెతోపాటు పుట్టింట్లో వదిలి వెళ్లాడు. తిరిగి వారిని తీసుకెళ్లడానికి రాకపోవడంతో శిల్ప తల్లిదండ్రులు గణేష్‌ను ప్రశ్నించగా తనకు అదనపు కట్నం ఇవ్వాలని డిమాండు చేశాడు. దీనిపై పెద్దమనుషులు, పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. శిల్ప ఫిర్యాదు మేరకు భర్త గణేష్‌రెడ్డి, అత్త ఆదిలక్ష్మీ, మామ రామిరెడ్డితోపాటు మరో ముగ్గురిపై రామకుప్పం హెడ్‌కానిస్టేబుల్ గోపి గృహహింస కేసులు నమోదు చేశారు.

షార్ చరిత్రలో మరో కీలక ఘట్టం

● నింగిలో ప్రయాణానికి ఎల్వీఎం3-ఎం5 సిద్ధం



నింగిలోకి ఎగిరేందుకు సిద్ధంగా ఉన్న ఎల్వీఎం3-ఎం5 రాకెట్

సూళ్లూరుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో చారిత్రక విజయం నమోదుకు సిద్ధమైంది. అత్యంత బరువైన ఉపగ్రహ ప్రయోగానికి షార్ తొలిసారిగా సిద్ధమైంది. ఇందుకు సంబంధించి కౌంట్‌డౌన్ శనివారం సాయంత్రం ప్రారంభమైంది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన సీఎంఎస్-03 (జీశాట్-7ఆర్) కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా షార్ నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే తాజా రాకెట్‌ను మూడు దశల్లోనే ప్రయోగించనున్నారు. కమ్యూనికేషన్ అవసరాలను తీర్చడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. అంతేకాదు పౌర, వ్యూహాత్మక, నావికా సేవలను అందించనుంది. తాజా ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ శనివారం సాయంత్రం 5.26 గంటలకు మొదలైంది. 24 గంటల తర్వాత షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇప్పటి వరకు షార్ నుంచి 102 ప్రయోగాలు చేపట్టారు. ఇది 10వ ప్రయోగం.

మూడు దశల్లో ప్రయోగం

43.5 మీటర్ల ఎత్తు 642 టన్నుల బరువు కలిగిన ఎల్వీఎం3-ఎం5 రాకెట్‌ను మూడు దశల్లో ప్రయోగిస్తారు. మొదటి దశలో స్ట్రాఫాన్ బూస్టర్లలో ఉండే 400 టన్నుల ఘన ఇంధన సాయంతో మండించి మొదటి దశ 105 సెకన్లలో పూర్తి చేస్తారు. అక్కడ నుంచి రెండో దశలో 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని మండించి 304.70 సెకన్లకు రెండో దశను పూర్తి చేస్తారు. కీలక దశ క్రయోజనిక్ దశను (మూడో) 95.54 సెకన్లకు మూడో దశను పూర్తిచేస్తారు. మూడో దశ అనంతరం రాకెట్ శిఖర భాగాన ఉన్న ఉపగ్రహాన్ని 965.94 సెకన్లకు కక్ష్యలోకి చేరవేస్తుంది.

మార్చిలోగా ఏడు ప్రయోగాలు : ఇస్రో ఛైర్మన్

మనదేశ అంతరిక్ష కార్యక్రమం ఎల్వీఎం3-ఎం5 సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగంతో ముఖ్యమైన మైలురాయిని చేరుకోనుందని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ అన్నారు. శనివారం ఆయన ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వచ్చే మార్చిలోగా ఏడు ప్రయోగాలు ఉంటాయన్నారు. ఆయనతో పాటు షార్ డైరెక్టర్ పద్మకుమార్, ఎంఎస్ఏ డీడీ గోపికృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



శిక్షణ తీసుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

కుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కుప్పం డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ సాగర్‌రాజ్ అన్నారు. బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం డిగ్రీ కళాశాలలో శనివారం ఐసీటీ అకాడమి సహకారంతో సీయట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో జీవితంలో ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. డాక్టర్ హరిత పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బిజినెస్ ప్లానింగ్, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. రిలేషన్‌షిప్ మేనేజరు నాగేశ్వరయ్య, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ప్రశాంత్ తరగతుల నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా బాధ్యత వహించారు. కుప్పం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధారాణి మాట్లాడుతూ ఇలాంటి మరిన్ని శిక్షణ కార్యక్రమాలు జరిపేలా ఐసీటీతో తమ కళాశాల ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీటీ కళాశాల కోఆర్డినేటర్ బాలకృష్ణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.పార్థిబన్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు జీడిరేవుల వంకపై రాకపోకలు



మధుసూదన నాయుడిని సన్మానిస్తున్న నాయకులు

సోమల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సోమల - పెద్దఉప్పరపల్లె మార్గంలోని సరస్వతీ పురం వద్ద జీడిరేవుల వంక తాత్కాలిక కల్వర్టు పనులు శనివారం పూర్తి కావడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకు పోయింది. గత 15 రోజులుగా ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు స్తంభించాయి. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్ నాయుడు దృష్టికి సమస్యను విన్నవించుకోవడంతో ఆయన తన సొంత నిధులతో తాత్కాలిక పనులకు శ్రీకారం చుట్టారు. మూడు రోజుల పాటు కూటమి నాయకులు పనులను ముమ్మరం చేసి రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నాయకులతో కలిసి జీడిరేవుల వంకను సందర్శించడంతో స్థానికులు అయన్ను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, యధుశేఖర్‌నాయుడు, నీటి సంఘ చైర్మన్ గల్లా బోస్, వై. సాంబయ్య, మునీశ్వరరావు, అసూరి బాలాజీ, చంద్రశేఖర్‌నాయుడు, కోటీశ్వరరావు, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునస్వామి

రామకుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సన్నద్ధం కావాలని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టర్ మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, అంజనేయరెడ్డి కోరారు. ముద్దనపల్లె, ననియాలతండా, నారాయణపురం తండా, 89పెద్దూరు, వీర్నమల, పెద్దతండా, గుట్టూరుతండా, చిక్కపల్లెతండా పంచాయతీల టీడీపీ శ్రేణుల సమావేశాల్లో వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంతోపాటు కుప్పం నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. సమావేశాల్లో ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, కడ పీఏసీ సభ్యుడు రఘు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, కో-ఇన్‌చార్జి కామరాజనాయక్, నవీన్, వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు మురళీ తదితరులు నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, గంట్లప్పగౌడు, నరసింహులు, లోకేశ్, మనోహర్, గజేంద్ర, జేయి, సురేష్, భూపతి, భానుమూర్తి, రాజకుమార్ నాయక్, మునీంద్రనాయక్, కదిరప్ప, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్రావతరణ దినోత్సం



రాష్ట్రావతరణ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కూతేగానిపల్లెలోని పరమహంస యోగానంద విద్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల అవతరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం గురించి ప్రిన్సిపాల్ ఆజాద్‌హుస్సేన్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ప్రతాప్, విశ్వనాథ్, కన్నడ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సుధ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలి



మణీంద్రం, మిట్టపల్లెల్లో రక్తపరీక్ష శిబిరం ప్రారంభోత్సవంలో నేతలు

రామకుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని టీడీపీ రామకుప్పం మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, క్లస్టర్ కో-ఇన్‌చార్జీలు నవీన్, కామరాజనాయక్, ఐటీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధి మిట్టపల్లె, మణీంద్రం, ననియాలతండా గ్రామాల్లో ఉచిత రక్తపరీక్ష శిబిరాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో రామలింగారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సతీష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

పుంగనూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం వచ్చే ఏడాది జనవరి 23 వరకు అవకాశం ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో అనధికార లేఅవుట్లలో 30 అడుగుల రోడ్డు, డ్రైనేజీ కాలువలకు స్థలాలను కేటాయించాలన్నారు. అలాంటి స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు మున్సిపాలిటీ అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాధితుడికి సీఎం సహాయనిధి సాయం



ఇరికిపెంటలో సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు

సోమల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్వతీపురానికి చెందిన రామానాయుడుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.49 వేల చెక్కును సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు శనివారం అందజేశారు. ఈక్రమంలోనే ఇరికిపెంట, లక్ష్మీపురం, ఎర్రమిట్టలో పలువురికి ఫించన్లు నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు గుడుపల్లెలో జనసేన జిల్లా అధ్యక్షుడి పర్యటన

కుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనసేన జిల్లా అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ ఆదివారం గుడుపల్లె మండలంలో విస్తృతంగా పర్యటిస్తారని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్ తెలిపారు. ఉదయం 11 నుంచి మిట్టపల్లె, యాగానిపల్లె, కనమనపల్లె గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం కనమనపల్లెలో జరిగే ప్రత్యేక సమావేశంలో జనసేన అధినేత ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు, బలోపేతం అనే అంశాలపై అతిథులు ప్రసంగిస్తారని చెప్పారు. జిల్లా అధ్యక్షుడి పర్యటనలో జనసేన కార్యకర్తలు, అభిమానులు విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలని నరేశ్ కోరారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు సోమల విద్యార్థి

సోమల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సోమల హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థి అయ్యప్ప చరణ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు హేమసుధాకర్ తెలిపారు. అక్టోబరు 30న ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో కొత్త మంచూరులో నెట్‌బాల్ పోటీలు నిర్వహించగా అయ్యప్ప చరణ్ ప్రతిభ చూపాడు. కృష్ణా జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ కరుణానిధి తెలిపారు.

చంద్రన్న పాలనపై ప్రజల్లో సంతృప్తి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విశ్వనాథ్

రామకుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎంతో సంతృప్తికరంగా ఉన్నారని రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్ తెలిపారు. శనివారం రామకుప్పం మండలం కావలిమడుగుకు చెందిన పంద్యాల మడుగు పంచాయతీ వైసీపీ వార్డు సభ్యురాలు శ్యామలమ్మతో పాటు ఆ పార్టీ కార్యకర్తలు సామప్ప, శివగామి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విశ్వనాథ్, కృష్ణానాయక్‌లు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. నేతలు శ్రీనివాసులుగౌడు, ఆనంతకుమార్‌గౌడు, ఉమేష్, బాబు, బాలు, మునెప్ప, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ శమిపతి

పుంగనూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు పాలనలోని కూటమి ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నట్లు పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శమిపతి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాగానిపల్లె పంచాయతీలో ఆయన సచివాలయ అధికారులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పింఛన్లు తొలగించారని కొందరు అనవసర ప్రచారం చేస్తున్నారని, అర్హత ఉన్న వారికి పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న అప్పు ముఖేశ్ తదితరులు

కుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం 14వ వార్డులో నివాసముండే టీడీపీ సీనియర్ కార్యకర్త, దళిత మహిళ (101) శనివారం వయసు వల్ల వచ్చే అనారోగ్య కారణాలతో మృతి చెందారు. టీడీపీ నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మట్టి ఖర్చులకుగాను రూ.10 వేలు మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు మునెప్ప, స్థానిక పార్టీ అధ్యక్షుడు సుకుమార్ పాల్గొన్నారు.

వృద్ధులకు ఇళ్ల వద్దకే పింఛన్లు



పలమనేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో శనివారం సామాజిక పెన్షన్లు 96.44 శాతం మందికి అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి .రమణారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో మొత్తం 4,517 మందికి 4,356 మందికి పెన్షన్ అందజేసినట్లు పేర్కొన్నారు. వృద్ధుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

● కల్లూరులో డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు ● జిల్లా స్థాయికి 24 మంది ఎంపిక



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంఈవో శిద్దరామయ్య

కల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గంగాధరనెల్లూరు, పెనుమూరు, పూతలపట్టు, చిత్తూరు, గుడిపాల, యాదమరి, తవనంపల్లి, ఐరాల, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల విద్యార్థులకు డివిజనల్ స్థాయిలో అండర్-14, అండర్-17 కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 48 మంది క్రీడాకారులను జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఆటల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

● పులిచెర్ల నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది వీరే

పులిచెర్ల మండలం నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు అధిక సంఖ్యలో విద్యార్థులు ఎంపికైనట్లు పీడీలు రాజశేఖర్, రెడ్డిప్రవీణ తెలిపారు. అండర్ -17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు రెడ్డిప్రియ, రూప, హేమ, సంజన, సాయిశ్రీ, సౌమ్య, కీర్తన, సయ్యద్‌మాలిక్, బన్నీ, మునివర్మ, యుగంధర్ ఎంపికయ్యారు. అండర్ -14 కబడ్డీ పోటీలకు నమిత, నిష్మా, భవ్యశ్రీ, గురుప్రసాద్, సతీష్‌కుమార్, మహేష్‌కుమార్ ఎంపికైనట్లు తెలిపారు. పీడీలు కిషోర్‌కుమార్, శివప్రసాద్, శ్రీనివాసులు, సులోచన, వాణి, లోకేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ అభివృద్ధి ఫలాలు



కంగుందిలో పీఎస్ఎం, భైరుగానిపల్లెలో రాజ్‌కుమార్ పింఛన్ల పంపిణీ

కుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ఫలాలు అర్హులందరికీ అందించడానికి కృషి చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం మండలం కంగుంది గ్రామంలో శనివారం ఆయన ఇంటింటికీ వెళ్లి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే 3వ వార్డు పరిధిలోని భైరుగానిపల్లెలో కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ గడపగడపకూ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మరోవైపు టీడీపీ 11వ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, తన క్లస్టర్ పరిధిలో సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కుప్పం మండలం కృష్ణదాసనపల్లెలో ఐటీడీపీ ఉపాధ్యక్షుడు ఈఆర్‌బీ. బాలాజి, డోళగుట్ట గిరిజనవాడలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరిగింది. టీడీపీ నాయకులు జేకే.సంతోశ్, చెక్కునత్తం మణి, బీరప్ప, రాము, బాలు, వెంకటాచలం, వీఆర్వో మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతికి నివాళులు



భైరెడ్డిపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గద్దూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బుడ్డారెడ్డి (81) శనివారం మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, పలువురు టీడీపీ నాయకులు గద్దూరు గ్రామానికి వెళ్లి బుడ్డారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

తెలుగుతల్లి విగ్రహానికి పూజలు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, విద్యార్థులు

పుంగనూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పుంగనూరులో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరా సర్కిల్‌లోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే డిమాండ్‌తో స్వాతంత్ర్య సమరయోధుడు పొట్టి శ్రీరాములు 1952 అక్టోబరు 19న మద్రాస్‌లో నిరాహార దీక్ష ప్రారంభించి 58 రోజులకు 1952 డిసెంబరు 15న ప్రాణత్యాగం చేశారని వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు, పుంగనూరు సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ వెంకటరమణ, సింగిల్‌విండో అధ్యక్షుడు పగడాల రమణ, బీజేపీ నాయకులు జగదీశ్‌రాజు, డిష్ రాజారెడ్డి, ప్రసాద్‌స్వామి, చంద్రరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సదుంలో 95 శాతం పింఛన్ల పంపిణీ

సదుం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సామాజిక పింఛన్ల పంపిణీని 95 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో రాధా రాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనారోగ్య కారణాలతో ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి 2, 3 తేదీల్లో అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర నోములు



చౌడేపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేదారేశ్వర నోములను శనివారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కార్తీక మాస ఏకాదశి సందర్భంగా స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు భక్తులకు కేదారేశ్వర నోముల వ్రత కథను వివరించారు.

దాత సహకారంతో తరగతి గదికి ఫ్లోరింగ్ పనులు



ఫ్లోరింగ్ పనులు పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు చంద్రమౌళి

చౌడేపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోటూరు ప్రాథమిక పాఠశాలలో దాత పిల్లారి ఏజెన్సీ అధినేత జీవన్ ప్రకాష్ సహకారంతో తరగది గదిలో ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయని టీడీపీ నాయకులు చంద్రమౌళి తెలిపారు. శనివారం ఆయన జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు 108 మంది విద్యార్థులు ఉండగా 5 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పనుల్లో ఒక తరగతి గది మంజూరైనా నిర్మాణం పూర్తికాకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో హెచ్ఎం మురళీ దాతలను కోరడంతో పిల్లారి ఏజెన్సీ అధినేత జీవన్ ప్రకాష్ సహకారంతో ప్రస్తుతం ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



పలమనేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రాజన్న, డైరెక్టర్ శంకరప్పలను శనివారం మధ్యాహ్నం చైర్మన్ స్వగ్రామం అలకుప్పంలో వాల్మీకి సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ కమిటీకి మొదటిసారిగా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన కె.రాజన్నను చైర్మన్‌గాను, శంకరప్పను డైరెక్టర్‌గాను నియమించినందుకు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ రాష్ట్ర నాయకులు, పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మామడుగు నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షులు బాలకృష్ణ, గంగవరం బాలాజీ, రొంటకుంట్ల నరసింహులు, చిన్నూరు అశోక్, మునస్వామి, టి.భైరెప్ప తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకటరమణస్వామికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకటరమణస్వామి

పుంగనూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం పలు ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. స్థానిక కోనేరు వద్ద వెలసిన టీటీడీకి చెందిన కల్యాణ వెంకటరమణస్వామి వారిని ఆలయ అర్చకులు సుప్రభాతసేవతో మేల్కొలిపి అభిషేకాలు, అలంకరణ ప్రత్యేక పూజలు చేశారు. అఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే స్థానిక భీమగానిపల్లె సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద అభయాంజనేయ స్వామి వారికి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, నిర్వహించారు. పుంగనూరుకు చెందిన కుసుమ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఉద్యోగాలకు 49 మంది విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పలమనేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో చివరి సంవత్సరం చదువుకుంటున్న 49 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శనివారం ఎంపికైన వారికి లెటర్లు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు తెలిపారు. బెంగళూరుకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్, చెన్నైకు చెందిన మెర్క్యూ కంపెనీలకు చెందిన ప్రతినిధులు కిరణ్‌కుమార్, జస్టిన్‌జానీ ఎంపిక చేశారు. 200 మంది విద్యార్థులకు గాను 49 మంది ఎంపికయ్యారని తెలిపారు.

ఘనంగా కేదారేశ్వరి నోములు



వ్రతంలో పాల్గొన్న భక్తులు

పుంగనూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏకాదశి సందర్భంగా కేదారేశ్వరిదేవి నోముల వ్రతాన్ని శనివారం పుంగనూరు పరిసర ప్రాంతాల్లోని ఆలయాలు, ఇళ్లల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక భోగనంజుండేశ్వరస్వామి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి, వీరభద్రస్వామి, మారెమ్మ తదితర ఆలయాల్లో ఉదయం నుంచి పట్టణం నుంచే కాకుండా వివిధ గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. అర్చకులు గౌరీదేవి చరిత్రను చదివి వినిపిస్తూ నోముల వ్రతాన్ని పూర్తిచేశారు.

అభివృద్ధిపై మాట్లాడటం సబబు కాదు



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో పుంగనూరు నియోజకవర్గంలో రెండు దశాబ్దాలుగా జరిగిన అభివృద్ధిని అవహేళన చేస్తూ మాట్లాడటం టీడీపీ నాయకుడు మధుసూదన్ నాయుడికి సబబు కాదని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. సోమల మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో జీడిరేవుల వంక తెగిపోవడంతో మరమ్మతులు చేసి మురిసిపోతున్న మధుసూదన్ నాయుడు పుంగనూరు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయల వ్యయంతో జరిగిన అభివృద్ధి పనులను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. వైసీపీ నాయకులు ఇమ్రాన్, రమేశ్‌రెడ్డి, గిరిధర్ రెడ్డి, ఇర్ఫాన్, శ్రీరాములు, ఎల్లారెడ్డి, వెంకటరమణారెడ్డి, రాజశేఖర్, బాషా పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా ప్రభుత్వం



రామకుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆపన్నులకు అండగా నిలుస్తోందని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధి కెంపసముద్రం, మిట్టపల్లె, రామకుప్పం పట్టణాల్లో వారు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల మేరకు పింఛన్ల మొత్తాన్ని పెంచి సీఎం మాట నిలుపుకున్నారని తెలిపారు. కార్యక్రమాల్లో నేతలు మునిరత్నం, నవీన్, శ్రీనివాసులు, సుబ్బయ్య, టీవీరవి, ఆదిల్, బాలరాజు, సుబ్రీ, నిసార్, మంజునాథ్, నియాజ్, అక్బర్‌సాబ్ పాల్గొన్నారు.

విద్యార్థినులు నైపుణ్యాలు పెంచుకోవాలి: డీఆర్‌డీఏ పీడీ



కళాశాలకు ప్రింటర్ అందజేస్తున్న తాసా ఫుడ్ నిర్వాహకులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థినులకు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి సూచించారు. శనివారం స్థానిక ఎస్‌పీఎస్ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ప్రసంగించారు. విద్యార్థినులు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. తాసా ఫుడ్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ అర్షద్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థినుల్లో ఆలోచన శక్తి పెరగాలని చెప్పారు. అనంతరం ఆయన కళాశాలకు కంప్యూటర్ ప్రింటర్‌తోపాటు 300 మంది విద్యార్థినులకు యూనిఫాం వితరణ చేశారు. తాసా ఫుడ్ మేనేజర్ సుమీర్ అహ్మద్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ మనోహర్, ఉషారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు కృషి చేద్దాం

వెదురుకుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీత విజయలురెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సమగ్రత దినోత్సవం జరిగింది. ట్రైనీ ఎస్ఐ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలు



కొత్తూరులో వరిపైరును పరిశీలిస్తున్న అధికారులు

పెనుమూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి, వేరుశెనగ పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టాన్ని గుర్తించి.. వివరాలను ప్రభుత్వానికి పంపే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, ఈ-క్రాప్ నమోదు చేయనివారి పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మండలంలో పూలతోటలకు కూడా పెద్ద ఎత్తున నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. వాటిని అధికారులు ఇంతవరకు పట్టించుకోలేదని చెప్పారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు రావాలి

ఐరాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టెన్త్‌లో మెరుగైన ఫలితాలు రావాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఇందిర సూచించారు. శనివారం టెన్త్ పరీక్ష కేంద్రాలైన ఐరాల, ఎం.పైపల్లె, కాణిపాకం పాఠశాలలను తనిఖీచేశారు. ఐరాలలోని ఎంఆర్సీ భవనంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంఈవో రుష్యేంద్రబాబు, హెచ్‌ఎంలు వాసుదేవన్, లత, భానుప్రసాద్, లక్ష్మణబాబు, నరేంద్రరెడ్డి, గిరిప్రసాద్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి : ప్రభుత్వ విప్ థామస్



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్

వెదురుకుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ స్పష్టం చేశారు. శనివారం చెంచుగుడి గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. పలువురు తమ సమస్యలను థామస్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను, ఇద్దరికి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులను, లైబ్రరీ తదితర భవనాలను ప్రారంభించారు.

సర్కారు బడుల్లో చదువుకున్న వారికే ప్రభుత్వ ఉద్యోగాలపై త్వరలో నిర్ణయం: ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో థామస్ ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని, ఆ దిశగా త్వరలో ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హైరోడ్డులో అక్రమ కట్టడాలను తొలగించండి

● కమిషనర్ నరసింహ ప్రసాద్



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైరోడ్డులో ఉన్న అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. కొన్ని రోజులుగా హైరోడ్డు(కోర్డుడౌన్) విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డుపై, కాలువలపై అక్రమ కట్టడాలు ఉండటంపై కమిషనర్ చర్యలకు ఉపక్రమించారు. వీటిని వెంటనే తొలగించాలని ఆదేశించడంతో శనివారం టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగేంద్ర పనులు చేపట్టారు. సంతపేటకు వెళ్లేదారిలో లక్ష్మి థియేటర్ ప్రహరీని తొలగించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

టెట్‌పై రివ్యూ పిటిషన్ వేస్తామని లోకేశ్ హామీ

● పీఆర్టీయూ నాయకుల హర్షం

యాదమరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టెట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున రివ్యూ పిటిషన్ వేస్తామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ హామీ ఇవ్వడంపై పీఆర్టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పీఆర్టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కె.కనకాచారి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు జె.హిమబిందు, శివప్రసాద్, సురేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, షకీల్, హరికృష్ణ, ఆనందపిళ్ళై, అహ్మద్, వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాలువ, ప్రహరీ సమస్యకు పరిష్కారం



నంగమంగళం వద్ద అధికారులు

గుడిపాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నంగమంగళం గుడి వద్ద కాలువ, ప్రహరీకి సంబంధించి సమస్యపై కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు బాధితులు అర్జీ ఇచ్చారు. ఆయన ఆదేశాలతో శనివారం డీపీవో సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, డీఈ నందకిషోర్ గ్రామాన్ని సందర్శించారు. సమస్యను పరిశీలించి.. పరిష్కరించారు. ఏఈ పవన్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



గంగాధరనెల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పదో తరగతి విద్యార్థిని హాసినిశ్రీకి జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిందని భానోదయ స్కూల్ కరస్పాండెంట్ మద్దిపట్ల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. ఈమెకు ప్రశంసాపత్రాన్ని ఎస్పీ తుషార్ అందజేశారన్నారు. విద్యార్థినిని టీచర్లతో కలిసి శనివారం అభినందించారు.

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి: సీపీఐ



రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని నగరవాసులతో కలిసి సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం చిత్తూరు రైల్వేస్టేషన్‌లోని రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్రమైన చిత్తూరులో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని విజ్ఞప్తి చేశారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌ను ఒకటో ప్లాట్‌ఫారంపై ఉంచాలన్నారు. ప్లాట్‌ఫారాలు మారడానికి లిఫ్ట్ సౌకర్యం, ఉచితంగా ఆర్వో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలన్నారు. సీపీఐ నేతలు నాగరాజు, రమణ, మధుసూదనయ్య, బాబురెడ్డి, మణి, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే మురళీమోహన్



సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న మురళీమోహన్

బంగారుపాళ్యం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. బంగారుపాళ్యంలో శనివారం జరిగిన సంతలో కూరగాయలను కొనుగోలు చేశారు. అక్కడున్న దుకాణదారులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తనకు 95535 86199 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. రైతులు ఎదురుపడగా 'అన్నా.. మీకు మామిడి సబ్సిడీ వచ్చిందా' అని అడగ్గా, వారు అందిందని చెప్పారు. అలాగే మండల కేంద్రంలోని తగ్గువారిపల్లె పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కోకా ప్రకాష్ నాయుడు, కమలనాథరెడ్డి, రమేష్, లోకనాథనాయుడు, హేమచంద్రనాయుడు, సూరి నాయుడు, మోహన్ నాయుడు, జనార్ధన్ గౌడ్, నాసిర్ ఖాన్, జాకీర్ హుస్సేన్, సర్దార్, రాధాకృష్ణమ నాయుడు, గిరిబాబు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి నాని.. కూలిన పాత ఇల్లు




చిత్తూరు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిట్టూరు ఏఎస్ఎం వీధిలో ఓ పాత ఇల్లు వర్షానికి నానడంతో కూలిపోయింది. కొన్నేళ్లుగా ఆ ఇంట్లో ఎవరు లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. మిద్దెపై మొక్కలు మొలిచి గోడకు పగుళ్లు ఏర్పడ్డాయి. వారం రోజుల కిందట ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి గోడ పగుళ్లలో నీరు చేరడంతో నానిపోయింది. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఉన్నట్టుండి పెద్దశబ్దంతో కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గోడకూలినప్పుడు పక్కనే ఉన్న ఓ కొరియర్ వ్యాన్‌పై వ్యర్థాలు మాత్రం పడ్డాయి. స్థానికులు ఇంటి యజమాని బాబుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఆయనొచ్చి రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డుపై పడ్డ వ్యర్థాలను తొలగిస్తానని చెప్పారు. కాగా, నగరంలో కూడా చాలా పురాతన భవనాలు ఉన్నాయి. వీటిని ముందుగానే నగరపాలక అధికారులు గుర్తించి జనాన్ని అప్రమత్తం చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

వైభవంగా పూర్ణాహుతి



పూజల్లో పాల్గొన్న చెన్నకేశవులు నాయుడు తదితరులు

గుడిపాల, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): దళవాయిపల్లెలోని బసవ నారాయణ స్వామి ఆలయ మహాకుంభాభిషేకంలో భాగంగా పూర్ణాహుతిని అర్చక, పండితులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, టీడీపీ నాయకులు శరత్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, అయ్యప్ప, రవినాయుడు, రాజ, గ్రామస్తులు పాల్గొన్నారు.



విలువల్లేని విద్య వ్యర్థం



విద్యార్థినులకు విద్యాసామగ్రిని అందజేస్తున్న ఆముదాల మురళి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విలువల్లేని విద్య వ్యర్థమని శతావధాని ఆముదాల మురళి అన్నారు. శనివారం దొడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో అమృత భారతి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. విలువలను చదువుకు జోడించడం ద్వారా ఆనందమయ జీవితాన్ని గడపవచ్చన్నారు. వివేకానందుడిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ ఒక సంస్థను స్థాపించాలన్న లక్ష్యంతో ముందుకెళ్లాలని చెప్పారు. దేశం పట్ల కృతజ్ఞతతో ఉండాలన్నారు. హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల శ్రేయస్సే తమ లక్ష్యమన్నారు. అనంతరం వివేకానంద జీవిత సందేశం పుస్తకాలతోపాటు పర్యావరణ పరిరక్షణకు సీడ్ బాల్స్, విద్యాసామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నగరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వీకేఆర్ పురం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సతీష్‌కుమార్ (22), మహేష్ (21)లకు తీవ్రగాయాలయ్యాయి. మద్యం మత్తులో ద్విచక్రవాహనం నడుపుతూ వచ్చిన వీరు అదుపు తప్పి ముందుగా వెళుతున్న వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. గాయపడ్డవారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరికీ తీవ్రగాయాలవడం, ఇద్దరూ తమిళనాడులోని తిరువళ్లూరువాసులు కావడంతో అక్కడున్న జీహెచ్‌కు తరలించారు.

లగేజీ వ్యానును ఢీకొన్న లారీ: డ్రైవర్‌కి గాయాలు



ఇళ్లపైకి దూసుకొచ్చిన లగేజీ వ్యాను

యాదమరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): లగేజీ వ్యానును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాను డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సంతగేటు వద్ద శనివారం మధ్యాహ్నం చిత్తూరు వైపు వెళుతున్న ఒక సిమెంట్ లోడ్ లారీ ముందు వెళుతున్న లగేజీ వ్యానును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లగేజీ వ్యాను అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ఇళ్లపైకి దూసుకెళ్లింది. అక్కడున్న ఓ గోడకు ఢీకొనడంతో వాహనం ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో వ్యాను డ్రైవర్ 184 గొల్లపల్లెకు యువరాజ్ తలకు గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి స్థానికులు తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు కాలేదు.

చెరువు కట్టకు కొట్టిన కాలువ పూడ్చివేత



ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువను పూడ్చేసిన అధికార యంత్రాంగం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెదురుకుప్పం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లె వద్ద మంచినీటి చెరువు కట్టకు కాలువ కొట్టి నీటిని వదిలేశారు. దీనిపై 'ఇదేం పని?' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికార యంత్రాంగం వెంటనే ఎక్స్‌కవేటర్ తీసుకొచ్చి.. కాలువను పూడ్చేసి, నీటి వృథాను అరికట్టారు.

విద్యార్థులకు అభినందన



శ్రీరంగరాజపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలో శనివారం చెస్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చిల్లామాకులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న భరత్ (అండర్-17 బాలుర విభాగం), 7వ తరగతి చదువుతున్న గీతిక (అండర్-14 బాలికల విభాగం)లో ప్రతిభ చూపారు. వీరిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడంతో హెచ్‌ఎం సత్యవేణి, ఉపాధ్యాయులు ఆనంద్, మోహన్, గోవర్ధన్ అభినందించారు.



విద్యాసామగ్రి వితరణ



బంగారుపాళ్యం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముంగరమడుగు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ టీచర్ జాన్సన్, విశ్రాంత టీచర్ రామస్వామి, నరేష్, హరి, రాజేష్, ప్రభాకర్, మునిరత్నంలు విద్యాసామగ్రి, దుస్తులను శనివారం వితరణ చేశారు. హెచ్‌ఎం ప్రభాకర్‌నాయుడు, మునిరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు

శ్రీరంగరాజపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వనజ ఆదేశించారు. శనివారం వెంకటాపురం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణి, సిబ్బంది పాల్గొన్నారు.



వరసిద్ధుడి ఆలయంలో
అంతర్గత బదిలీలు

ఐరాల(కాణిపాకం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధి కోసం శనివారం ఉద్యోగుల అంతర్గత బదిలీలను ఈవో పెంచలకిషోర్ నిర్వహించారు. ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డికి అకామిడేషన్, కల్యాణకట్ట, విశ్రాంతి భవనం, అన్నదాన పర్యవేక్షణ, చీఫ్ సెక్యూరిటీ విధులు కేటాయించారు. ఏఈవో రవీంద్రబాబుకు ప్రధాన ఆలయం, ఉప ఆలయాలు, జే1 విభాగంతోపాటు సెక్యూరిటీ పర్యవేక్షణ విధులు అప్పగించారు. ఏఈవో హరిమాధవరెడ్డికి గణాంక విభాగం, లడ్డూ పోటు విభాగంపై పర్యవేక్షణ, ఏఈవో బీఎల్‌ఎన్ ప్రసాద్‌కు పడితరం స్టోర్స్, లీగల్, లీజెస్, భూములు, సమాచార హక్కు చట్టం, టెండర్ల విభాగంపై పర్యవేక్షణను కేటాయించారు. ఏఈవో వి.ధనుంజయకు గోశాల, శానిటేషన్ విభాగంపై పర్యవేక్షణ, ఏఈవో ధనపాల్‌కు క్యూలైన్ల ద్వారా స్వామి దర్శనం, అన్నదానం వద్ద తదితర వసతులపై భక్తుల నుంచి నేరుగా, ఐవీఆర్ఎస్ ద్వారా రోజూ అభిప్రాయాన్ని సేకరించే విధులను కేటాయించారు.